క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన రేపు

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పర్యటించనున్నట్లు రెండు మండలాల వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల నిధులతో, 11 గంటలకు పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ప్రజా ఆరోగ్య భవనాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేయనున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు కోరారు.

స్పాట్ అడ్మిషన్లు

పుత్తూరు రూరల్: స్థానిక పిళ్లారిపట్టు పాలిటెక్నికల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. నాలుగు తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ మార్క్‌లిస్ట్, ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్‌కార్డులతో హాజరు కావాలని కోరారు. రూ.6 వేల అడ్మిషన్ ఫీజు చెల్లించాలని వెల్లడించారు. వివరాలకు 8008638821 నంబరులో సంప్రదించాలన్నారు.

గేటుపుత్తూరు విద్యార్థుల సత్తా



ప్రతిభ చాటిన బాలికలతో ఉపాధ్యాయ బృందం

పుత్తూరు రూరల్: స్థానిక గేట్‌పుత్తూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల(తెలుగు) విద్యార్థులు ఎస్‌జీఎఫ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం కె.రవి తెలిపారు. బుధవారం పాఠశాలలో క్రీడాకారుల అభినందన సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ పుత్తూరు మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి అండర్–17 కబడ్డీ, ఖోఖో పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయిదేవరెడ్డి, చేతన్, దస్తగిరి, అరుణ్, బాలికల్లో లక్ష్మీ, హరిత, సంగీత ఎంపికైనట్లు తెలిపారు. అండర్–17 లాంగ్ జంప్ పోటీల్లో చేతన్ ప్రథమ స్థానం సాధించగా, సాయిదేవరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ జయదేవ్, సంషుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

నింద్ర: మండలంలోని జగన్నన కాలనీలలో నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు అన్నారు. బుధవారం మండలంలోని ఇరుగువాయి గ్రామంలో జగనన్న కాలనీ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో ఆదాయం

కార్వేటినగరం: అక్రమంగా మద్యం తరలిస్తూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాటలో రూ.64,782 ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ కే.శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అక్రమమద్యం తరలిస్తూ పట్టుబడిన ఇన్నోవా కారు, టీవీఎస్ స్పోర్ట్స్ బైక్‌ను బహిరంగ వేలం వేశారు. ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ మాట్లాడుతూ వాహన వేలంలో రూ.64,782 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

పాలసముద్రం: మండలంలో మంజూరైన గృహ నిర్మాణాల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు హౌసింగ్ ఏఈ దాముతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 940కి గానూ 670 గృహాలు పూర్తి చేశారన్నారు. మిగిలిన 270 గృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించి అక్టోబర్ 15లోపు అన్ని గృహాలు పూర్తి చేయాలని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పూర్తయిన గృహాలకు రూ.12 వేలు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

శ్రీరంగరాజపురం : మండలంలోని మెదవాడ ఎస్టీ గ్రామానికి చెందిన మహిళలు ఇంటి స్థలాలు కేటాయించలని తహసీల్దార్ లోకనాథపిళ్లెక్కి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇంతవరకు ఇంటి స్థలాలు లేవని, తాము నివాసం ఉంటున్న ఇళ్లు చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి రోడ్డు నిర్మాణానికి ఇచ్చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తమ గ్రామంలో నిర్వహించినప్పుడు డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ స్థలం పరిశీలించి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

జేసీకి వినతి

వెదురుకుప్పం: గత ప్రభుత్వంలో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సంతబయలు మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో గత ప్రభుత్వంలో సంతబయలు పంచాయతీలో సుమారు రూ.20 లక్షల వరకు సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు జేసీ దృష్టికి తీసుకొచ్చారు.

'జగనన్నకు చెబుదాం'లో సమస్యల పరిష్కారం

- స్పందన అర్జీలపై పరిష్కార మార్గం చూడండి : జేసీ శ్రీనివాసులు
- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పోటెత్తిన ఫిర్యాదుదారులు



పాల్గొన్న అధికారులు, ప్రజలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ రేణుక

వెదురుకుప్పం: ప్రజా సమస్యలను గుర్తించి ప్రతి సమస్యను జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాసులు అన్నారు. బుధవారం వెదురుకుప్పంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మారుమూల గ్రామాల్లో నుంచి బాధితులు ఫిర్యాదు చేసేందుకు వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం జగనన్నకు చెబుదాం ద్వారా వారంలో రెండు రోజులు బుధ, శుక్ర వారాల్లో మండల స్థాయిలో జిల్లా అధికారుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలస్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించే కార్యక్రమం ద్వారా జిల్లా అధికారులు పాల్గొనడంతో సమస్యలను అక్కడికక్కడ పరిష్కరించే ఆస్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో 15 రోజుల తరువాత మండలస్థాయిలో సమీక్ష నిర్వహించి చర్చించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వం ధ్యేయమన్నారు. క్షేత్రస్థాయిలోనే రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుని వారి పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరిస్తే గ్రీవెన్స్ ద్వారా అధికంగా ఫిర్యాదులు రాకుండా ఉంటాయన్నారు. అలాకాకుండా ఇచ్చిన అర్జీలపై కాలయాపన చేస్తే ప్రజలు నిత్యం అర్జీలు తీసుకుని కార్యాలయాల చుట్టూ తిరిగే ఆస్కారం ఉందన్నారు. వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఫిర్యాదుదారులను సంతృప్తి పరిచేలా వ్యవహరించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ పరమైన సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, డీఆర్‌డీఏ పీడీ తులసి, డ్వామా పీడీ గంగాభవాని, గృహనిర్మాణ సంస్థ పీడీ పద్మనాభం, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రవికుమార్, పాల్గొన్నారు.

పోటెత్తిన అర్జీదారులు..

మండల కేంద్రంలో వెదురుకుప్పంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. మండలంలోని మారుమూల గ్రామాల నుంచి సమస్యలను వినతిరూపంలో అధికారులకు సమర్పించారు. మొత్తం 746 అర్జీలు రాగా ఒక్క రెవెన్యూ శాఖకు సంబంధించి 656 అర్జీలు వచ్చాయి. హౌసింగ్ 18, పంచాయతీరాజ్ 17, సర్వే సెటిల్‌మెంట్, భూమి రికార్డులు 16, విద్యుత్ శాఖ 7, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ 6, సివిల్‌సప్లైస్ 6, పోలీస్ శాఖ 4, వ్యవసాయం 4, విద్య 3, ఆర్‌డబ్ల్యూఎస్ 2, డీఎస్‌ఓ, డీఆర్‌డీఏ, డీటీఓ, పశుసంవర్ధక శాఖ, ఇరిగేషన్, డ్వాక్రా శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు. వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని జేసీకి వినతిపత్రం ఇచ్చారు. అలాగే జక్కదొనలో భూ ఆక్రమణపై నిరసన తెలిపారు.

పటిష్టంగా జగనన్న ఆరోగ్య సురక్ష

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, స్వచ్ఛతా హీ సేవా వంటి కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ పీ.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అలాగే కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలస్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

అదేవిధంగా జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్న సమావేశ భవనాన్ని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళిని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం ప్రతి బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం,



పుత్తూరులో పౌష్టికాహారం భోజనం చేస్తున్న గర్భిణులు

చిక్కీ, అరటిపండు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులు మాట్లాడుతూ ప్రతి బుధవారం కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణకాంత్, ప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వివక్షపైనే జాషువా పోరాటం

నగరి : కులమతాల వివక్షతపై పోరాడిన కవి జాషువా అని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ప్రముఖ తెలుగు కవి గుర్రం జాషువా జయంతిని కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాషువా కవిలాంటి సంఘసంస్కర్తల పోరాట ఫలితంగా నేడు కులమతాల వివక్షను చాలా వరకు అధిగమించామన్నారు. ఇది సమాజానికి అవసరమైన చక్కటి పరిణామమన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరాజు మాట్లాడుతూ కులమతాలతో పాటు పేద ధనిక, ఆడ మగ అనే వివక్షను ఇలాంటి కార్యక్రమాల వల్ల వాటిని అధిగమించవచ్చని పిలుపునిచ్చారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సి.చిన్నపాపమ్మ మాట్లాడుతూ జాషువా రచనలను ఆయన పొందిన అవార్డులను వారి జీవిత చరిత్రను వివరించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి. వరలక్ష్మి మాట్లాడుతూ జాషువా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

తనకు తానుగా విశ్వనరుడిగా ప్రకటించుకున్న నేపథ్యాన్ని, సమాజంలోని సమస్యను గుర్తించిన తీరును ఆ సమస్యను పరిష్కరించడానికి నమ్మిన సిద్ధాంతమైన 'ధర్మమునకు పిరికితనమెన్నడు లేదు..సత్య వాక్కునకును చావు లేదు' అన్న విధానాన్ని విశ్లేషించారు. డాక్టర్ అరుణ కుమారి ఈ సందర్భంగా జాషువా రచించిన గబ్బిలం కావ్య సందేశాన్ని ఉటంకించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్య రహిత గ్రామాలే లక్ష్యం

- యువత ముందుకు వస్తేనే సాధ్యం
- చెడు అలవాట్లకు బానిసలైతే జీవితాలు అంధకారం
- గంజాయి, మత్తు పదార్థాలతో పట్టుబడితే చర్యలు తప్పవు
- ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ కమిషనర్ నాగలక్ష్మి

కార్వేటినగరం: ప్రతి గ్రామాన్ని మద్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలన్నారు. అప్పుడే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఆఫ్ విజయవాడ వారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడలో మాజీ సర్పంచ్ అంకయ్య, ఉపసర్పంచ్ మోహన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, సారా వంటి అక్రమ వ్యాపారాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారితే జీవితం అంధకారం అవుతుందన్నారు. ఈ వయసులో గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు అలవాటు పడి చాలామంది మంచి భవిష్యత్‌ను, జీవితాలను కోల్పోతున్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ఎవరైనా మత్తు పదార్థాలతో పట్టుబడితే చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయని ఆమె సూచించారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీలు, మత్తు పదార్థాల విక్రయాలను వీడి సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. అలా మారిన వారికి ప్రభుత్వమే పలు వ్యాపారాలు చేసుకుని బతికేందుకు రుణసౌకర్యాలను కల్పించడానికి కూడా సిద్ధంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాలను బాగు చేసుకోవడంతో పాటు ఉన్నతంగా జీవించాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే గ్రామాల్లో ఎక్కడైనా సారా, మద్యం, గంజాయి, గుట్కా వంటి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్–14500కు ఫోన్ చేయాలని ఆమె కోరారు. అలాంటి సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, ఎస్‌ఈబీ సీఐ నాగరాజు, ఎస్‌ఐ భాస్కర్, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు అవసరం

పాలసముద్రం : పాఠ్యాంశాల బోధనలో మెలకువలు, నూతన విద్యావిధానంపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని ఎంఈఓ గిరిజ తెలిపారు. బుధవారం పాలసముద్రం సీఆర్పీ పరిధిలోని ఉపాధ్యాయులకు పాలసముద్రం ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన పాఠ్యబోధన విద్యార్థులకు ఎలా చేయాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి టీచర్ సాంకేతిక విధానాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 13 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సంస్థ ప్రతినిధులు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం, కాంచీపురానికి చెందిన బయోసైన్స్ రీసర్చ్ ఫౌండేషన్ సంస్థ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 13 మంది ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ తొలి అడుగుతోనే ప్రారంభవుతుందని చెప్పారు. జాబ్‌మేళాలో ట్రైనీ సైంటిస్ట్, అనలిటికల్ కెమిస్ట్ ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూల్లో 27 మంది అభ్యర్థులు హాజరు కాగా, 13 మంది ఎంపికైనట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబూరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ పి.సుజన, జేకేసీ సమన్వయ కర్త సంధ్య, కెమిస్ట్రీ ఇన్‌చార్జి పి.హరిబాబు, ఎం.శంకర్‌రావు, సమన్వయకర్త ఏ.రమేష్‌బాబు, శ్రీకాళహస్తి జేకేసీ ఎఫ్‌టీఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ చేయకపోతే చర్యలు తప్పవు



బహిరంగ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ గంగాభవానీ

శ్రీరంగరాజపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ప్రభుత్వం మంజూరు చేసిన మామిడి చెట్లు, ఫారం పనుల్లో జరిగిన నష్టాన్ని రికవరీ చేయకపోతే చర్యలు తప్పవని చిత్తూరు డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామీణ ఉపాధి పథకం బహిరంగ సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతం రోజులుగా 23 పంచాయతీల్లో జరిగిన 22–23 సంవత్సరంలో చేపట్టిన పనులను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. ఇందులో రూ.11 కోట్లు పనులను చేసినట్లు గుర్తించామన్నారు. మామిడి చెట్లు చనిపోవడం, ఫారం పనులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదు మేరకు రూ.6,550ను రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, పద్మజ, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీడీ శోభన్‌బాబు, ఏపీఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ మీట్ రేపు

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కార్వేటినగరం విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కేశవులు

కార్వేటినగరం: జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు డీఎంపురం విద్యార్థులు ఎంపిక కావడంపై ఆ పాఠశాల హెచ్‌ఎం కేశవులు అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 25న తిరుపతి జిల్లా బుచ్చినాయుకండ్రిగ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లాజట్టు ఎంపిక అండర్–14, అండర్–17 పోటీల్లో తమ పాఠశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపికై నట్లు చెప్పారు. 9వ తరగతి చదువుతున్న హెచ్.శశిరాం, అలాగే పీ.మోక్ష అండర్–14 విభాగంలో, పదో తరగతి విద్యార్థిని ఎ.వనిత అండర్–17 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం విద్యార్థులకు క్రీడలపైనే కాకుండా యోగా, ఓంకారం ప్రాణాయామం వంటి అంశాలపై చక్కటి శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజును, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

పుత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పుత్తూరు మండలం గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. బీఎస్‌కండ్రిగలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో సంధ్య, మునిమోహిత్ ఎంపిక కాగా, అండర్–17 విభాగంలో చేతన్‌కుమార్, యామిని ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు వేపంజేరి విద్యార్థులు



వేపంజేరి స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగాధరనెల్లూరు: జిల్లాస్థాయి క్రీడాపోటీలకు వేపంజేరి విద్యార్థులు ఎంపికై నట్లు వేపంజేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎస్‌ఆర్ పురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గస్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికలకు త్రోబాల్ పోటీల్లో వేపంజేరి విద్యార్థులు ఎంపికై నట్లు చెప్పారు. అందులో అండర్–14 విభాగంలో హరికృష్ణ, అయ్యప్ప, శశిధర్, తులసి, జయశ్రీ, కుమారి, అండర్–17 విభాగంలో పవన్, లేఖన, జీవనశ్రీ, గౌతమి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఎంపికై న విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జయచంద్ర, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వరి సాగుపై అవగాహన

నింద్ర: మండలంలోని రైతులు రబీ సీజన్‌తో వరి సాగు చేసే రైతులు తమ పొలంలో పచ్చిరొట్టె సాగు చేసి వరి సాగు చేయడం వల్ల కలిగే లాభాలను గురించి అవగాహన కార్యక్రమం అగరం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి తులసిరాం మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో రైతులు వరి సాగు చేయడం వల్ల మెలకువలను తప్పనిసరిగా పాటించాలని ఆధునిక పద్ధతులతో పాటు యంత్రం సాయంతో వరినాట్లు వేయడం వల్ల కూలీల సమస్య లేకుండా ఉంటుందన్నారు. దీంతో ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. విత్తనశుద్ధి కూడా చాలా ముఖ్యమన్నారు.

నిరుపేదలకు పట్టాల పంపిణీ



పట్టాలు పొందిన వారితో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం, సత్రవాడకు చెందిన పలువురు నిరుపేదలకు మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న సొంత ఇల్లు నిర్మించుకోవడానికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వారు పలు సమస్యలను ఎదుర్కొన్నారు. వారు మంత్రి ఆర్కే రోజాకు తమ సమస్యను విన్నవించుకోగా అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లను సిద్ధం చేయడంతో వారికి ఇళ్ల నిర్మాణానికి పట్టాలు సిద్ధమయ్యాయి. వాటిని మంత్రి క్యాంపు కార్యాలయంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు ఎవరూ సొంత ఇల్లు లేకుండా ఉండకూడదన్న ముఖ్యమంత్రి ఆశయం, మంత్రి సహకారంతో పలువురు పేదలు నేడు సొంత ఇంటికి యజమానులు కానున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు రూరల్: మారుమూల గ్రామాలకు సైతం విస్తరించిన తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ కె.ఆర్ముగం కోరారు. వడమాలపేట మండలం పత్తిపుత్తూరులో జనంలోకి మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తపాల శాఖలో ఖాతాలు ప్రారంభించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని పొందవచ్చని వివరించారు. నెలవారి నగదు డిపాజిట్లు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పొదుపు ఖాతా, సుకన్య సమృద్ధి యోజన, జీవిత బీమా వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై బ్యాంకుల



మాట్లాడుతున్న ఏఎస్‌పి ఆర్ముగం

కన్నా ఎక్కువ వడ్డీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ తులసి, కార్యదర్శి గోపి, తపాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

నగరి : ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తోందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త సి.ప్రభాకర్ వర్మ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌జీఎన్ జిల్లాపరిత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన 0–18 ఏళ్ల మధ్య వయసు గల దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం నిర్వహించిన వైద్య నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. డీసీహెచ్‌ఎస్ చిత్తూరు వారి ద్వారా నియమితులైన వైద్యబృందంతో దివ్యాంగులను పరీక్షించి 53 మందికి అవసరమైన వీల్‌చైర్, ట్రైసైకిల్, రొలేటర్, వినికిడి యంత్రాలు నిర్ధారించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వీటిని వారు సద్వినియోగం



మాట్లాడుతున్న సహితవిద్య సమన్వయకర్త ప్రభాకర్‌వర్మ

చేసుకోవాలన్నారు. భవితకేంద్రంలో నిర్వహిస్తున్న వివిధరకాల థెరపీసేవలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్‌ఎం పార్వతిదేవి, ఆర్థో వైద్యులు లక్ష్మీపతి, ఈఎన్‌టీ వైద్యులు శిల్పా, ఆడియోలజిస్ట్ దేవా, ఫిజియోథెరపిస్ట్ కిషోర్, ఐఈ డీఎస్‌ఎస్ టీచర్లు శ్రీలక్ష్మి, సంగీత, రాజేష్, ఐఈఆర్‌పీలు లావణ్య, భవాని, వెంకటేష్, శివకుమార్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోరు వర్షం.. కూలిన స్లాబులు



భేరివీధిలో కూలిన స్లాబు, జోరుగా కురుస్తున్న వర్షం

నగరి : మండల పరిధిలో మూడు రోజుల పాటు కురుస్తున్న జోరువర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు పాత భవనాలకు చెందిన స్లాబులు వర్షపు నీటితో తడిచి కూలి కింద పడుతున్నాయి. బుధవారం పట్టణ పరిధి భేరివీధిలోని ఒక నివాసం ముందున్న స్లాబు, సత్రం దక్షిణపు వీధిలోని ఒక భవనానికి చెందిన స్లాబు అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయానికి కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా స్లాబు పడి పెద్ద శబ్దం రావడంతో ఇరుగు పొరుగు వారు భయాందోళనకు గురయ్యారు.